# తెగారం



అగ్గిమీద గుగ్గీలం పడగానే గుప్పుగుప్పున లేచిన పొగ గుడిసె నిండింది. ఘాటైన వాసన. ఉక్కిరి బిక్కిరవుతున్నా కదలకుండా ఎల్లవ్వనే చూస్తున్నారు చుట్టూ కూర్చున్నవారు. ఈరగొలను నడుముకు చుట్టుకుని మెటికలు విరుస్తూ యాప కొమ్మల్ని అందుకుంది ఎల్లవ్వ. మట్టి కంచుట్లోని నిప్పును ఒకసారి ఎగదోసి బండారి (పసుపు) తో కంచుడు చుట్టూ పొత్తి చుడుతూ ముందున్న వారివైపు చూసింది. గుడ్డిలైటు వెలుతురు.

రాజిరెడ్డి భార్య సావిత్రి, కోడలు సునంద, తురుకోల్ల అమీనా, కమ్మరి నర్సవ్వ, సాకలి రాజం, ఇంకో ఇద్దరు పిల్లతల్లులున్నారు. చిరిగిన చాపలు పరుచుకుని కూర్చున్నారు. వెనుకగా వచ్చిన రాజిరెడ్డి కొడుకు సాయిరెడ్డి గోడకానుకుని చేతులు కట్టుకుని నిలబడ్డాడు. ముండ్లమీద నిలుచున్నట్లుగా నిలుచుండి ఓరగా బీడీలు చేస్తున్న లలితవైపు చూస్తున్నాడు. వంచిన తల ఎత్తకుండా గోడ పక్కన కూచుండి బీడీలు చేస్తోంది లలిత.

ఎల్లవ్వకు ఒళ్లు మండింది.

'ఎన్నడెరుకలేదు. ఆపదివడ్డదేమో ఇంటింటి రాజులు ఉరికచ్చింండ్రు. పాపపు ముండ కొడుకులు గాదు.... వాని సూపుల రాయివడ ఎట్ల సూత్తుండు సూడు. ఇత్తు ఒకటైతే చెట్టు ఒకటైతదా!' తల్లడ మల్లడమైన తల్లికోడిలా గాండ్రకిచ్చింది ఎల్లవ్వ. ఉల్కిపడి ఇటువైపు తిరిగాడు సాయిరెడ్డి.

"దొర్సానీ... మీరు ముందుకు రాండ్రి... ముందుగాల్ల మీరు సూపిచ్చుకుంటే ఎల్లిపోతరు. వాళ్లు రెండు మూడు బొట్లు తిరిగినోళ్లు...." ఆవులిస్తూ అన్నది ఎల్లవ్వ.

కోడలును రమ్మని సైగ చేస్తూ ముందుకు జరిగింది సావిత్రి. "లలితా.... సాటులెవ్వు బిడ్డా! కైనీడతలుగుతుంది" సాయిరెడ్డి వైపు ఓరగా చూస్తూ అన్నది ఎల్లవ్వ.

లలిత ఇంట్లోకి వెళ్లింది. కళ్లు మూసుకుని బేవులు తీస్తూ ఎగతట్టడం మొదలెట్టింది ఎల్లవ్వ. యాపమండల్ని జులిపించి చేతుల్ని పైకెత్తి వెన్ను విరుస్తూ "ఒహహోయ్... ఒహహోయ్..." అని కేకపెట్టింది.

చంటి పిల్లలు ఉల్కిపడి ఏడుపును అందుకున్నారు. అందరూ ఎల్లవ్వ వైపు చూస్తున్నారు. సునంద మాత్రం బిడియంగా చుట్టూ చూస్తోంది. డేగ చూపులతో సాయిరెడ్డి గదినంతా తడుముతున్నాడు. ఎల్లవ్వకు దేవుడు నిండుకుంది. యాపకొమ్మల్ని జులిపిస్తూ తలను గుండ్రంగా తిప్పుతూ పాటను అందుకుంది.

"కట్టువోతరారా... నా కన్న కొడుకా పెట్టువోతనారా నా పెద్ద కొడుకా... రాతరాసినోడా ఆరి బమ్మదేవా... తల్లి పార్వతమ్మా... తండ్రి శంకరుడా... నాయిన్న నీకు పదివేల శరణే... "పటపట పండ్లు కొరికింది ఎల్లవ్వ.

"శరణు... శరణు.. గంత కోసమెందుకు బాంచెను... శాంతం శాంతం" నర్సవ్వ అంది.

"ఆరాలు దప్పితే గోరాలునాయి... గోరాలు దప్పితే ఆరాలునాయి. లందల బుట్టి బొందల పెరిగిందాన్ని. కార్తీకరాజుల రక్తం దాగిందాన్నీ.... కోటొక్కపూజలా కొలువున్నదాన్ని... ఎముడాల రాజన్నా పదివెయిల శరణే... కొలుచుకున్నోళ్లకు కొంగు బంగారాన్ని... మరిచిపోయింగ్రంటే మంటలు పుట్టిత్త..." ఆదివారం బెస్తవారం పొద్దుమాపు కచీరు. పాట మామూలే!

దేవతలందరినీ తలుచుకుని లొట్టలు వేస్తూ నోటితో వేగంగా 'గాంగ్రు'మని గాలిని పీల్చి గురకలు తీస్తూ 'నరలోకాన్ని నమ్మరాదే...' అంటూ రాగం తీస్తూ సావిత్రిని ముందుకు రమ్మన్నది ఎల్లవ్వ.

లోకం గురించి ఎవలకు తోచింది వాళ్లు మాట్లాడుతున్నారు. సావిత్రి నిప్పుల కంచుడు ముందుకు జరిగింది. తన వెంట తెచ్చుకున్న నిమ్మకాయలు, పసుపును ముందటపెట్టి కోడలును ముందుకు జరుగుమని సైగ చేసింది. బిడియంగా సునంద ముందుకు జరిగింది.

సగం మూసిన కళ్లతో శిగమూగుతూ సావిత్రి చేతిని అందుకుని పసుపుతో రాసి ముక్కు వద్దపెట్టుకుంది ఎల్లవ్వ.

"తల్లీ! బాంచెను. మంచిగ జెప్పు. ఎవల కండ్లల్ల మన్నువడె! ఎవలనే మంటిమి! దొడ్లె గోజలు మంచిగుంట లెవ్వు! ఇంట్ల మనుసులు మంచిగుంటలేరు. వారంలనే రెండు బర్లు సచ్చిపాయె. ఇంటింటి రాజులు దవకాండ్లు తిరుగవడితిమి. మనిషి మాయనా దేవుని మాయనా..." మరింత దగ్గరగా జరుగుతూ అడిగింది సావిత్రి

'అహహో... ఒహోహో...' అంటూ ఎగతడుతూ బేవులు తీస్తూ "ఎట్లని జెప్పాలెనే బాలా... చెప్పటానికి నోరత్తలేదు. ఆగులు బుగులు అయితంది గదా...? అమాస పున్నానికి కడుపుల దప్పులు ఏగిచ్చినట్టు దడదడ ఉంటది. చెట్టుకు పురుగు తలిగినట్టు ఇంటింటి రాజులకు మనాది తలిగింది గదా! కుండకు మెతుకంటుతలేదు. చాటకు తౌడంటుతలేదు. అరుకతి లేదు బరుకతి లేదు..."

చెబుతుంది ఎల్లవ్వ.

ఎల్లవ్వ మొహంలో ఏదో తేజస్సు కనిపించినట్టు పరవశంగా చూస్తోంది సావిత్రి.

"అవును తల్లీ బాంచెను. గట్లనే అయితంది. ఎల్లమ్మ ఎల్లమ్మ అంటే ఎల్లమ్మ పట్నాలేత్తిమి. దుర్గమ్మ దుర్గమ్మంటే గద్దెగడితిమి. దేవమ్మ కొలువు గొలిస్తిమి. బాలమ్మకు జేత్తిమి. అయినా ఎప్పటి చిప్ప ఏనుగులనేనాయె. రోజురోజుకు ఇంకా అంగడంగడి గావట్టె..." ఆవేదనగా అన్నది సావిత్రి.

పకపకా నవ్వింది ఎల్లవ్వ. యాపకొమ్మలతో పెయ్యంత దులిపి వీపుల కొట్టింది.

"పుండు ఒక జాగలుంటే మందొక జాగలయింది. కనపడుతలేదానే! దేవుని మాయగాదు. దయ్యం మాయలేదు. ఆడిది మొగోడు కలిసి మంత్రం జేసింద్రు. పిండి బొమ్మను చేసి కడుపల్ల పాతరవెట్టింద్రు. దూరపోల్లు గాదు. తెల్లారితే పొద్దు గూకితే మాట్లాడిచ్చేటోల్లే..." లేచి నిలబడి బండారితో పొత్తిచుడుతూ అన్నది.

"ఎవల కండ్లల్ల మన్నువడే! పటేలు ఎవలనేమంటడు. ధర్మరాజసొంటోడు" తురుకోల్ల అమీనా అన్నది. ఎవలకు తోచిన తీరువాళ్లు సావిత్రి గురించి, కొడుకుల గురించి, పటేలు గురించి మాట్లాడుతున్నారు.

పటపట పండ్లు కొరికింది ఎల్లవ్వ. వెంటనే నవ్వింది. 'ఒహహు... ఒహహు...' అంటూ ఎగతట్టింది. కండ్లు సగం మూసి సగం తెరిచి ఉన్నాయి. వీపు మీద, భుజాల మీద, మెడ మీద పసుపు రాస్తూ-

"మంచి దాయితమ్మని దగ్గరికి పోంద్రి. ఇంటికి, దొడ్డికి బందానం జేపియ్యంద్రి. గైలో మైలో అన్నట్టు మరిచి ఉంటే ల్యాగలకు సూటి వెట్టింద్రు." అన్నది ఎల్లవ్వ. వీపు మీద నెత్తి మీద నిమ్మకాయల్ని పెట్టి కొరికింది.

"మాకు ఏ దాయితమ్మడు (మంత్రకాడు) ఎరుకలేదు. దేవునికంటే పెద్ద దాయితమ్మడె వలు. సంపినా నువ్వే! సాదినా నువ్వే! బందానం నువ్వే జెయ్యాలె. కట్టు నువ్వే గట్టాలె" గడుసుగా అన్నది సావిత్రి.

తన వల్ల కాదని బెట్టు జేసి చివరికి ఒప్పుకుంటూ ఐదు వారాలు బొట్లు తిరగాలని చివరి వారం బందానమని ఒప్పుకుంది దేవత. బండారి ఆనతి ఇచ్చి తానం జెయ్యంగ ఇంట్లో వాళ్లంతా కలుపుకోవాలని చెప్పింది. కోడలుకూ కొడుక్కూ బొట్టు పెట్టింది. వాళ్లిద్దరూ వెళ్లిపోయారు. సావిత్రి వెనకగా వెళ్లి గోడకు ఆనుకుని కూసుంది.

అరగంటలో అందరికీ బొట్లూ, దించుడు, ఆనతులు, తాయితులు పూర్తయ్యాయి. అందరూ వెళ్లిపోయాక సిగాన్ని సాలిచ్చింది ఎల్లవ్వ. ఎప్పటి మాదిరిగా తల్లి దగ్గరకు వచ్చి యాపకొమ్మల్ని కింద పడకుండా అందుకుంది లలిత. పెయ్యి నిండుకున్న దేవుడు పోయే వరకు తల్లిని పట్టుకుని మెల్లగా కూర్చోబెట్టింది.

కొద్దిసేపట్లో ఎల్లవ్వ మామూలు మనిషయింది. వణుకు తగ్గింది. ఈరవోసిన తల్లి వెంట్రుకల్ని ముడేసి కంచుడుని పక్కకు జరిపి బీడీలచాట ముందు కూర్చుంది లలిత.

వాయిలింపు తీసి సావిత్రిని చూస్తూ "అయ్యో! దొర్సానీ... మీరు ఈడనే ఉన్నరా...? ఏమన్నది దేవత. మంచిగైతదన్నదా.... రాకరాక వచ్చింద్రు. కోడలు దొర్సానైతే బంతి పువ్వులెక్క ఉండె. చెక్కపేడయింది" అంటూ ఇంట్లోకి వెళ్లి కుర్చీ తెచ్చి వేసింది ఎల్లవ్వ.

సావిత్రి కుర్చీలో కూర్చుంది. ఉన్నంతలో గది సురువుగానే ఉన్నా ఒకవైపు దండెం దాని నిండా బట్టలు, మరోవైపు దొంతులు, దర్వాజ దగ్గర గడంచే... దాని మీద బొంతలు... పొగ చూరిన తాటికమ్మల చెమ్మవాసన.... అసహ్యంగా అనిపిస్తుంది సావిత్రికి. ఆమె ఏమనుకుంటుందో తెలిసిపోతూనే ఉంది ఎల్లవ్వకు.

కావాలనే ఆమెను కూచోబెట్టి మాటల్ని సాగదీస్తుంది ఎల్లవ్వ. తను సిగమూగి బొట్లు పెట్టినప్పటి నుండి సావిత్రి ఎప్పుడూ రాలేదు. ఎప్పుడైనా కలుపు తియ్యడానికో, నాటెయ్యడానికో పిలిచేందుకు వస్తే వీధి చివరనుంచే 'ఎల్లీ' అని పిలిచి చెప్పి వెనుకకు మల్లేది. పైకి అనదిగనీ అంటుడు ముట్టుడు శీలం ఎక్కువగనే దొర్సానికి.

"ఏం జెయ్యాల్నే ఎల్లా... దేవత ఐదు వారాలు రమ్మంది. ఎవరో మంత్రం జేసింద్రట. పటేలు పాణమైతే పూర్తిగ బాగలేదు. పెద్దోడు ఇంటిపట్టు పడుతలేడు. అంగడంగడయితుంది" బాధతో గొంతు కూరుకుపోయింది. కుర్చీలోంచి లేచి ఎల్లవ్వ రెండు చేతులను పట్టుకుంది సావిత్రి.

"నేనైతే ఎట్లన్న వత్తుంటిని. కోడలు బిడియపడుతుంది. వాడైతే బల్మీటికి వచ్చిండు. నీ కట్టం ఉంచుకోను. ఐదు వారాలు నువ్వే మా ఇంటికి రా.... కాదనకే ఎల్లా.... నువ్వే దీపం పెట్టినట్టు! నాగలి నడిచే ఆరు ఎడ్లు బాగలెవ్వు". బతిమాలుతున్నట్టుగా అంది సావిత్రి. కాదంటే ఏడ్చేటట్టుగా ఉంది ఆమె గొంతు.

ఆయోమయంలో పడినా ఆనందంగా చూసింది ఎల్లవ్వ. ఆమె మొహంలో కించిత్తు గర్వం.

చేతుల బీడీని ఆపి తల్లివైపు సావిత్రి వైపు మార్చి మార్చి చూసింది లలిత. ఆమెకు కోపంగా ఉంది. ఏదో గులుక్కుంటుంది. మరో సారైతే సావిత్రి గ్రహించేదే! ఆమె చురుకుదనం పని చేయడం లేదు. ఎల్లవ్వవైపే దీనంగా చూస్తోంది.

కాదంటూనే చివరకు ఒప్పుకుంది ఎల్లవ్వ. బలవంతాన యాభైనోటు చేతిలో కుక్కి బయట పడింది సావిత్రి. 'చీకటి పూట మంచిగ పోంద్రి' అంటూ వాకిట్ల దాకా వచ్చింది ఎల్లవ్వ. వీధి లైటు వెలుతురులో ఆమె సందు మలుపు తిరిగే వరకు చూసి ఇంట్లోకి వచ్చింది.

"అవ్వా... సిగమూగుడే వద్దని నేనంటుంటె నువ్వేమో మంది ఇండ్లల్లకు పోతానంటవు. నీ చేతి గుణం మంచిదని, కాలు గుణం మంచిదని పెద్ద పెద్దోళ్లు మన ఇండ్లకు వచ్చుడేంది? మనం వాళ్ల ఇండ్లళ్లకు పోవుడేంది....? మనంతల మనముండాలె" విసుగ్గా యాష్టపడుతూ అన్నది లలిత.

ఎల్లవ్వ మారుపలుకలేదు. చిన్నగా నవ్వింది. ఆ నవ్వులో ఏదో గెలుపు ఉంది. పోరాడి ఎవరికీ అందని హక్కుల్ని గెలుచుకున్న సంతృప్తి ఉన్నది. ఆవేమీ తెలియని లలిత గొణుక్కుంటూనే ఉంది బీడీలు చేస్తూ.

రాలిన యాపాకులను, నిమ్మకాయల్ని ఊడ్చి తట్టలెత్తింది ఎల్లవ్వ. ఏదో అనుభూతి వెంటాడుతోంది. మనసు కదిలించే మాటలేవో ఉత్సాహాన్ని పుట్టిస్తున్నాయి. అడుగుల చప్పుడు విని

వెనక్కి తిరిగి చూసింది.

తండ్రి ఆశయ్య. సార వాసన గుప్పుమంది. ఎల్లవ్వకంటే ముందుగనే అందుకుంది లలిత.

"ముసలోడు ఇరుగ తాగిండు. ఎవలదన్న పంచాది చెప్పినవా...? ఈ నడుమ రోజుకొకటి అయితుంది"

"పంచాదా పాడా? నేను ఎదురుంగ కనవడితేనే చీదరికిచ్చుకునేటోడు రాజిరెడ్డి పటేలు. అయిన మనసుకు ఏం దొర్లిందో.....ఇంటికి రమ్మని బనుకుల కూసుండవెట్టి ఇస్కీ సీస ఇచ్చిండు. నేను పరీశానయిన్ననుకో... తాగెదాక ఇడువలేదు" తాగినా మాటలు యాసగా లెవ్వు. మనిషిస్థైర మీదనే ఉన్నాడు.

తల్లీ కూతుర్లిద్దరూ మొహాలు చూసుకుని నవ్వుకున్నారు. మర్యాద ఎందుకు చేసిండో అర్థమైంది ఇద్దరికి.

"అయితే మర్యాద మంచిగనే చేసిండంటవు పటేలు" నవ్వింది లలిత.

"పుణ్యానికచ్చింది గదా అని ఎక్కతక్క తాగినట్టున్నవు" అన్నది. "వాళ్లు మామూలోళ్లు గాదు. అందితే రాళ్ళు... అందకుంటే కాళ్లు...." తనే అన్నది తిరిగి.

"ఊ.. ఏం మాటలు... పెద్ద లేదు చిన్నలేదా....?" కసురుకుంటూ భోజనాలకు లేవదీసింది ఎల్లవ్వ.

ముగ్గురూ భోజనాలకు కూర్చున్నారు. ఎల్లవ్వ ఏదో అంటుండగా ఆశయ్యనే అందుకున్నాడు.

"వాళ్లు పగటిల్లి మనిషిని తోలిచ్చింండ్రు. మేం మ్యానోల్లం. మాకు గాక ఇంకెవరికిత్తరో చూత్తం. ఎత్తుకపోయి చేసుకుంటం అన్నరట...."

తింటున్నదల్లా బుక్కను ఆపి తాతవైపు చూసింది లలిత కోపంగా.

"వాడెవడు నన్ను ఎత్తుక పోనీకి. వానికి దమ్మేముంది. ఆ వంకర కాళ్లోడు సుడిగాలత్తే కొట్టుకపోతడు!" తాత మాటలు పూర్తికాకముందే అన్నది. ఆశయ్య ఆగిపోయాడు. లలితవైపు విసుగ్గా చూసింది ఎల్లవ్వ.

"గట్లనద్దు బిడ్డా! వాళ్లు అన్న దాంట్ల తప్పేంలేదు. మ్యానోల్లకు సతువుంటది. బావను చేసుకోకపోతే మనం సుట్టాలకు పాసిపోతం. మన మొకం ఎవ్వలు సూడరు" సముదాయిస్తున్నట్టుగా అన్నది.

"ఇన్ని రోజులు మనలను ఎవలు జూసిండ్రే! ఏ సుట్టాలచ్చింండ్రే! ఏం తింటున్నం. ఏడ ఉంటున్నమని ఎవలన్నా వచ్చింండ్రా. పిల్ల మంచిగుంది. చేతుల నాలుగు పైసలున్నయని మనల్ని బలిమి జేత్తండ్రు. నేనే మంచిగ లేకపోతే వాళ్లు మన మొఖం జూత్తురా... మనింటి కత్తురా" వాదానికి దిగుతున్నట్టుగా అన్నది లలిత.

ఆశయ్యకు సరాన వడ్డది. గిలాస అందుకుని గటగట నీళ్లు తాగి మనుమరాలు వైపు కూతురు వైపు భయం భయంగా చూసాడు.

"దీన్నేదో బుదురకిత్తనంటివి. గిట్ల మాట్లాడుతున్నదేంది...? వాళ్ళు ఇంటే ఏమనుకుంటరు. అయినా ఇష్టంలేంది ఏం చేత్తం.... చేసుకోక పోతే చేసుకోకపాయెతియ్యి. వాళ్ళను రావద్దని చెప్పి పంపుదాం" ఏం చెప్పాలో అర్థంకాక అన్నాడు ఆశయ్య. సుట్టాలకు దూరం కావద్దని అతనికి కూడా ఉంది.

"వద్దు నాయినా... ఇప్పటికే ఆడిబిడ్డలకు, మరుదులు, యారాండ్లకు దూరమైనము. కులంతోని బలం. ఈ లగ్గమైతే మందిల గలుస్తం. వాళ్లున్నరంటే ఆపతికి సంపతికి ఎంతో దీము. ఇవారదాక నువ్వు దీమున్నవు. ఇక నీకు శాతనైత లేదు. రేపకల్ల నాకు ఎవలైతరు నాయినా. దిక్కులేని కుక్క బతుకైతది" సముదాయిస్తున్నట్టుగా అన్నది ఎల్లవ్వ. ఆ మాటలు తండ్రికి గాక బిడ్డకు చెబుతున్నట్టుగానే ఉన్నాయి.

సర్రున చెంబును అందుకుంది లలిత. అన్నం పల్లాన్ని ముందుకు నూకి లేచింది. గచ్చుల చెయ్యిని కడుక్కొని మంచంలో ఒరిగిపోయింది.

ఆశయ్య నుదురు ముడిపడింది. మనుమరాలును కొత్తగా చూస్తున్నట్టు విచిత్రంగా చూసి కూతురువైపు తిరిగాడు. "నేను జెప్పలే...? ఇది మెడెం తన్నేసెటట్టుందని" గుసగుసగా అన్నాడు ముందుకువంగి.

కూతురు అన్నం మీది నుంచి లేచినందుకు కాదు.. అలా లేవడానికి ఆమెకు కలిగిన ధైర్యాన్ని చూసి బిగుసుకుపోయింది ఎల్లవ్వ. ఈ విషయం ఇప్పుడే ఎందుకు తీసానా అన్న బాధ కూడా కలిగింది. కూతురు మొండిపట్టును చూస్తుంటే భయమేసింది.

ఎల్లవ్వ మౌనంగా ఉండడంతో ఆశయ్య కదిలించలేదు. మారన్నం లేకుండానే లేచాడు. ఎల్లవ్వ కూడా లేచింది. గిన్నెలను సర్దిలైటును ఆర్పి నడుం వాల్చింది. ఆశయ్య అప్పటికే గుర్రు పెడుతున్నాడు. నిద్రపోయిందో లేదో కానీ లలిత ముడుచుకుని పడుకుంది.

ఎల్లవ్వకు నిద్ర రావడంలేదు. కడుపుల దడదడ.

భర్త చనిపోవడం, ఐదేళ్ల కూతురుతో పొట్ట చేత వట్టుకుని తండ్రి వద్దకు రావడం, ఇక్కడ పడ్డ కష్టాలు.. మొన్న మొన్ననే జరిగినట్టు కళ్ల ముందు కదులుతున్నాయి. కూలీకి పిలిచిన పటేండ్లు వేధించడం, పిడికెడు మెతుకులకు వారికి లొంగి పోవడం, అన్నీ గుర్తుకొస్తున్నాయి. ఒంటరి పోరాటం! బతుకు మీద ఆరాటం!

భార్య మీద గూడా చెయ్యేత్తిండో లేడో రాజిరెడ్డి పటేలు. గుడిసె తలుపు తెరువలేదని పొట్టు పొట్టు గొట్టిండు. ఇప్పుడచ్చిన దొర్సాని పటేలుతోని పోతున్నవని తమ్ములతోని కొట్టిపిచ్చింది. కొట్టి బెదిరిచ్చి వాళ్లు గూడా వచ్చుడు మొదలు వెట్టిండ్రు. నరకయాతన! అందరికీ అలుసై అత్యాచారాలకు బలైపోయింది. చిత్తకార్తి కుక్కల్లా గుడిసె చుట్టూ పటేండ్లు. బాధలను చెప్పుకుందామన్నా తల్లిలేదు. చిన్నప్పుడే అత్యాచారాలకు బలైపోయింది. ఏడుద్దామన్నా ఏడుపు వచ్చేదికాదు. కడుపునిండా ఎత. అడిగే దిక్కు లేదు. ఇరుగుపొరుగు వాళ్లు కూడా తనదే తప్పన్నట్టు చూసారు.

పీరీల అల్వాల దగ్గర పాట గట్టి పాడిండ్రు. ఏ కాపుదనపోళ్లు కైకిలుకు పిలువలేదు. తను ఎదురుపడితే చాలు ఆడోళ్లయితే తుప్ప తుప్ప ఊంచుకుంట పోదురు. మొగోళ్లు సీటిగొడుదురు.

కడుపు కుత కుత ఉడికేది. ఏడుపేడుపున దుఃఖం. కుమిలి కుమిలి ఏడ్చేది. ఏడుపు, దుఃఖం, జరం వేటిని చూడకుండా బలిమి చేసి పీక్క తినే పీతిరిగద్దలు చుట్టుకునేవి.

బతుకు కుక్కల నోట్లె ఇస్తారయింది. కన్నకర్మానికి కడుపుల వెట్టుకుని దాచుకున్నందుకు ఆశయ్యను కూడా 'థూ' అన్నరు. తనకు మదమెక్కిందన్నరు. కుమిలికుమిలి ఏడ్చేది.

ఎట్ల తగిలిందో గని దేవుని నీడ మొదలయింది. ఎల్లమ్మ దేవత పెయ్యి నిండుకుని వాక్కు ఇచ్చింది. శిగం కడుపు సల్లగుండ. శిగమచ్చుడు మొదలయిందంటే దేవుడత్తదని పటేండ్లు తాకడానికే భయపడ్డరు. చేతి గుణం మంచిదని పేరు వోయినంక మర్యాద ఇయ్యడం, వేరుగా చూడడం మొదలు పెట్టింగ్రు. కన్నెత్తి చూడడానికి భయపడ్డరు.

ఎంతలో ఎంత మార్పు. చెప్పలేని సంబూరం. 'శిగం' జీవితానికి భద్రతనిచ్చింది. మర్యాదను తెచ్చి పెట్టింది. వెంబడించిన మొగవాళ్లు, నీడను కూడా పారనియ్యని ఆడవాళ్లు, కులాన్ని, గుణాన్ని మరిచి 'ఎల్లీ'కి బదులు 'ఎల్లా' అని పిలుస్తూ ఇంటి మూడు చుట్లు పిల్లికూనలలోలె తిరుగుడు మొదలుపెట్టింగ్రు. పాణాలమీద ఆశ వదులుకున్న వారిని బొట్టు పెట్టి లేపింది. శివసత్తి ఇంటి పేరయింది. ఇది ఆశయ్యకు ఆదాయాన్ని పలుకుబడిని పెంచింది. అంటరాదు ముట్టరాదన్న ఇంటి చుట్టే ఆపదలో ఉన్న జనం! తను కలలో కూడా ఊహించని జీవితం కొత్తగా మొదలైంది.

కూతురు ఎదిగే వరకు జీవితం సాఫీగానే సాగింది. ఎదిగినాక కొత్త సమస్య మొదలయింది. తోట కూర కాడలా అందంగా ఉన్న లలిత ఊరి కంట్లో పడింది. అప్పటికీ ఇప్పటికీ మనుషులు మారినా మనుసులు మారలేదు. విచ్చలవిడితనం, పలుకుబడి పెరిగింది కానీ తగ్గలేదు.

శివసత్తిగా తనకు భద్రత ఉందేమో కానీ అది కూతురుకు కలిగించలేక పోతోంది. ఇప్పుడిప్పుడే లోకాన్ని చూస్తున్న లలితకు మగాళ్ల చూపులు చేష్టల్లో అర్థాన్ని వెతుక్కునే అనుభవం లేదు. చూసి చూడనట్టు పోయే ఎగ్గెలితనం వాళ్లకు రెట్టింపు బలాన్నిస్తోంది. డేగ చూపులు ఊరిలోనే కాదు. తన కులంలో కూడ మొదలైనవి.

గిట్టని పెద్దల బలంతోనే మల్లయ్య 'చేసుకుంటే లలితనే చేసుకుంటనని' మెడల దప్పు గట్టుకున్నడు. చూడడానికి మనిషి బాగున్నా చెడ్డ సోపతులు. హోటల్ మే ఖానా మసీద్ మే సోనా! బిడ్డ బతుకు కుక్క బతుకైతది. దీనికేం తెలుసు...? మనిషి మంచి గున్నడని వాని మీదనే మనసు పడుతోంది. ఇది చూసి సందు దొరికింది గదా అని పటేండ్లందరు మల్లయ్యను ఎగేత్తంగ్రు. దీన్ని మల్లయ్యకిచ్చి లగ్గం జేత్తె ఊర్లె పలారం పంచుకుంటరు. ఆగం జేత్తరు.

"అవ్వా..." కూతురు గొంతు మూలుగులా వినిపించింది. ఎల్లవ్వ ఆలోచనలు ఆగిపోయాయి.

"లలితా. ఏంది బిడ్డా" లేచి కూతురు మంచం దగ్గరికి పోయింది ఎల్లవ్వ.

ఎక్కెక్కి ఏడుస్తోంది లలిత. ఎంత సేపయిందో! కడుపు ఊదువట్టింది. కన్నీళ్లతో మెత్తసగం నానింది.

"ఏంది బిడ్డా.... ఎందుకేడుత్తన్నవు. నీకేం బాధచ్చిందే... నేను లేనా బిడ్డ.. గట్ల గుండె పలుగుతరా...?" సముదాయిస్తున్నట్టుగా అంటూ వీపుని నిమిరింది ఎల్లవ్వ.

"నాకు ఇప్పుడే లగ్గమద్దే...." వెక్కుతూనే అన్నది లలిత.

ఎల్లవ్వకు మరోసారి దడుగ్గుమంది. ఏ మాత్రం అలుసు ఇయ్యకుండా "చేసుకోవాలె బిడ్డ. కాలం మంచిగలేదు. పాపవ్వ బతుకు చూసినావు...? ఎట్లయింది! ఎన్ని నిందలేసింద్రు. పేదోనింట్ల పచ్చని ఇస్తారు కనిపిస్తే పెద్దోల్లకు కండ్లు మండుతయి బిడ్డా! వాళ్లది పీతిరిగద్ద చూపు. నల్లనాగుంబాము పగ. ఎల్మోని పగ ఏట్లెవడ్డాపోదట. కాపోనిపగ కాట్లెవడ్డా పోదట. పేదోల్లింట్ల అందంగా ఉన్న ఆడిదుంటే తప్పు! బట్టగాల్చి మీదేస్తరు" కూతురు వింటుందా లేదా అని చూసి మొదలెట్టింది.

"మొన్న నాగవ్వ సంగతి చూడలేదా...! పొట్ట తిప్పలుకు కైకిలివోతే గుంజులాడె. మొఖం మీద కాంద్రకిచ్చి ఊంచి బయటకత్తె పైసలెత్తుక పోయిందని దొంగతనం పెట్టె. ఆ నిందలు మీద పడక ముందే లగ్గం చేసుకోవాలె బిడ్డా..." సముదాయిస్తున్నట్టుగా అన్నది.

"ఊరుపాడు గాను మంచిది గాదు. పడిగెనీడ బిడ్డా..."

"అయితే బావను చేసుకోను" భయం భయంగానే అన్నది లలిత.

"అయితే ఎవలను చేసుకుంటవే" ఎల్లవ్వ నెమ్మదిగా అడిగినా గొంతులో కోపం వినిపించింది.

లలిత నోరు విప్పలేదు. విప్పకపోయినా ఎల్లవ్వకు తెలుసు. మరింత దగ్గరగా జరిగి తల నిమిరుతూ చెప్పింది.

"బిడ్డా! ఒంటరిగా నేను ఎన్ని కష్టాలు వడ్డనో నీకు తెలువది. నా బతుకు లెక్క నీ బతుకు కావద్దు. ఊర్లెదూర్లె లగ్గం జేసుకుంటే లంగ సోపతులున్నయి. కుక్కల లెక్క ఎంబడివడి చీరుక తింటరు. బావను చేసుకుంటే నువ్వు మందిల వడుతవు. మన చిన్నాయినలు, పెద్దనాయినలు, మామలుంటరు. నీ మీద ఈగెవాలది. ఇక్కడ మనం దిక్కులేని పచ్చులం బిడ్డా. ఈంత తాత కండ్లు మూత్తె రాత్రికి రాత్రి మనను సంపినా నయుండది పిరాదుండది..."ఎల్లవ్వ కండ్లళ్ల నీళ్లు.

చెప్పిన మాటలకంటే చెప్పని మాటలే ఎక్కువగా మనసులో మెదులుతున్నాయి. గుండె నిండా భయం. "ఐతారము బేస్తారము శిగమూగుడు మొదలు వెట్టిననంటే దయ్యం బట్టిన ఎందరినో మంచిగ జేసిన. మంత్రం జేసినోల్లను మనుషులల్ల గలిపిన. పండుగలు జేసుకుంటె పట్నాలు దొక్కిన. సంటి పిల్లలకు తాయితులు గట్టిన. ఇన్ని చేసినా రేపు ఆపదొస్తే ఒక్కడు నిలవడి మాట్లాడడు. చీరుక తినాలనే చూత్తరు..." ఎల్లవ్వ కూడా ఏడుత్తంది. ఏడుత్తూనే అన్నది.

"మల్లిగాడు మంచోడు గాదు. తండ్రి లేని గాగోడి పోరడు... వాన్ని లగ్గం జేసుకుంటే నా బరువు ఇంకింత పెరుగుతది. నీ మీదనే పాణాలు పెట్టుకుని బతుకుతున్న..." ఆపింది ఎల్లవ్వ. తండ్రి గురక వినిపిస్తుంది.

కూతురు ఏమైనా మాట్లాడుతదేమోనని చూసింది. లలిత ఉలకలేదు పలుకలేదు. ఏడ్సుడు మరింత ఎక్కువ చేసింది. ఎల్లవ్వకు గుండె దడ పెరిగింది. లేచి తన మంచంలో ఒరిగింది. నిద్ర పట్టని రంది మొదలయింది.

మరునాడే బందువులందరినీ పిలిపించి లలిత మాటలు పట్టించు కోకుండా పూలు పండ్లు పెట్టించి పెండ్లి ఖాయం చేసుకుంది. అప్పటిగ్గాని భయం పోలేదు. చుట్టాలు ఇల్లు నిండితే ఎంతో ధైర్యం వచ్చింది.

ఇది చూసి సోపతోళ్లు ఏం చెప్పారో మరునాడే గుడిసెలోకి వచ్చి లలిత పై చెయ్యి వేసాడు మల్లయ్య. కుక్కను గెదిమినట్టు గెదిమి తప్పును కడుపులోనే దాచుకుంది ఎల్లవ్వ. లలిత మాత్రం కుమిలి పోవడం మొదలెట్టింది.

❄ ❄ ❄ ❄

రాజిరెడ్డి ఇల్లంతా సందడిగా వుంది. ఒక పక్క వడ్లు. మరో పక్క మక్కలు. చిల్లర ధాన్యాల బస్తాలు. ఈ మధ్య శిగమూగి బొట్టు పెట్టడానికి ఎవరిండ్లకు వెళ్తలేదు ఎల్లవ్వ. పండుగులకు పట్నాలకు తప్ప. తన ఇంటికే రమ్మంటోంది. కావాలనే రాజిరెడ్డి ఇంటికి వచ్చింది ఇయ్యాల్ల. ఒక్కతి కాదు. కూతురును వెంట బెట్టుకుని!

ఎల్లవ్వ ఇదివరకు ఎన్నో సార్లు వచ్చినా గచ్చుల నుంచి పైకెక్కలేదు. పట్టు వరుసుడు వంటింట్లో ఉండాలని చెప్పి వంటింట్లోకి వచ్చింది. చాపపరిచి తల్లీ కూతుర్లను కూసోబెట్టింది సావిత్రి.

'ఇది తెచ్చిపెట్టు. అది తెచ్చిపెట్టు. పచ్చముగ్గేది. దొర్సానీ నువ్వు ఆగంగాకు. పటేలా నువ్వు గాపని అందుకుంటేంది. కోడలవ్వ నువ్వు కంకునాలు గట్టు. చిన్న పటేలా నువ్వు ఇటురా... ఉలువ గుడాలేవీ...?' అడుగుతోంది. చెబుతోంది. గెదుముతోంది. యాష్టపడుతోంది. ఏదో కొత్త మనుషుల్ని చూస్తున్నట్టు సంబూరంగా ఉంది ఎల్లవ్వకు. కావాలనే ఆగం జేస్తూ ఉరికిస్తోంది. మధ్య మధ్యలో లలిత పెండ్లి ముచ్చెట. వాళ్లకున్న భూములు, బోరుబాయిల గురించి, బలుగం గురించి చెబుతుంది. గర్వంగా ఉంది ఎల్లవ్వకు. ఓడిన చోటనే గెలిచినంత ఆనందంగా ఉంది.

నాటేసుడుకో, కోత కోసుడుకో పోతే నీళ్లకుండ వేరుగా పెట్టేది. ముట్టుకున్నందుకే తానం జేసేది. ఇంటి ముందుకు వస్తే కుక్కను గెదిమినట్టు గెదిమేది. ఇప్పటికైనా నా కులపోల్లు ఒక్కలు కూడా ఇంట్లకు అడుగు పెట్టలేదు. మనసులో మెదిలిన ఈ భావన మనుషులపై కసిని పెంచుతుంది. ఆ కసి పనులు పురమాయించి, ఆగమాగం జేసి, ఇదిలేదు అది లేదని కసురుకోవటంతో ఊరట కలిగిస్తుంది ఎల్లవ్వకు.

లలిత మౌనంగా కూర్చుంది. చెప్పిన పనులు చెప్పినట్టు చేస్తూ తల్లిపట్ల చూపుతున్న గౌరవం ఒకెత్తయితే... తాగుమని చాయ ఇచ్చి ఎంగిలి గ్లాసులను కోడలు దొర్సానే కడుగడం ఒకెత్తుగా లలితను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎల్లవ్వగా కాకుండా శివసత్తిగా తల్లి సాధించుకున్న గౌరవాన్ని తనలో విశ్లేషించుకుంటోంది. తేపతేపకు పెండ్లి ముచ్చట చెప్పటం మింగుడుపడటం లేదు. అప్పుడప్పుడు సునందను, సాయిరెడ్డిని ఓరకంట చూస్తోంది. మనసులో ఏదో కలవరం. మల్లయ్య గుర్తుకు వచ్చాడు.

పనులన్నీ పూర్తి చేసి నలుగురూ పట్టుముందు కూర్చున్నారు. "చిన్నోడిని రమ్మంటే రాకపాయె వాడొక్కడత్తే అందరం ఉన్నట్టుండే" అన్నది సావిత్రి.

సాయిరెడ్డి మల్లయ్యకు దోస్తు. పెళ్ళి గురించి చెబుతుంటే లలితనే చూస్తున్నాడు సాయిరెడ్డి.

"ఆఖరునాడు వత్తే సాలు. బండారి ఆనతిస్త. ఇచ్చిరాంద్రి. సదువుకున్న పిల్లగాడు ఇదేంది అదేందంటడు." నవ్వుతూ అంటూ గుగ్గిలాన్ని కంచుట్లోవేసి పొగను లేపింది ఎల్లవ్వ. బేకోట్లు మొదలయ్యాయి. ఎగతట్టుడు కూడా.

ఎల్లవ్వకు పూనకమచ్చింది. శిగమూగుడు మొదలయింది. "కలికి గాందారి మాందారి యాల్ల.

పసిపిల్ల పాలుముట్టని యాల్ల. చండాలు ముండ. డొక్కలు జీరి దోర్నాలు గడుత. పక్కలు జీరి పాతాలం దొక్కుత...'' పట పట పండ్లు గొరుకుతూ సొత్తి జుట్టి బొట్టు పెడుతుంది ఎల్లవ్వ.

ఒక్కసారి పెద్దగాకేక. అందరూ ఉల్కి పడ్డారు.

కూచున్నది కూచున్నట్టుగా వెనక్కి విరుచుకపడిపోయింది లలిత. "ఊహూ...ఊహూ.." అని ఎగతడుతూ చాపలో బొర్రడం మొదలెట్టింది.

"అరే... పొల్లకు కూడా శిగమచ్చింది. ఏం దేవుడో..." రాజిరెడ్డి అన్నాడు.

"అయ్యో! పాపం. గీ ఈడుకు శిగమత్తే పొల్ల బతుకెట్ల. పెండ్లి ఖాయమయింది." సునంద అన్నది జాలిగా. 'అవ్వలెక్క బిడ్డుంటది. ఏం జేస్తది' సావిత్రి అన్నది తేలికగా.

శిగంలో వున్న ఎల్లవ్వ కూతురుక్కూడా బొట్టుపెట్టింది. చేసే పనులు చేసి శిగం పాలిచ్చి కూతురును పట్టుకుని కూసున్నది. ఆమెకు కాళ్ల చేతులు కడుపుల జొచ్చినయి. భయంతో చలిజరం మొదలయింది.

లలిత అరగంట దాకా తేరుకోలేదు. నెత్తిని నాలెకు గుద్దుకుంది. పెయ్యంతా గిచ్చుకుంది. బూరెంటికెలు పీక్కుంది. దేవత లలితపై కన్నేసిందని తెలిసాక ఎల్లవ్వకు దుఃఖం ఆగలేదు.

"ఏం జెయ్యాలె బాంచెను. నా బతుకే ఇట్లయిపాయె. ఇప్పుడు దీనికత ఎట్ల ఎల్లాలె. ఎన్ని నితాలు కాపాడితే శివసత్తి అయితది. శిగమత్తదంటే లగ్గం ఎవలు జేసుకుంటరు. పాపపు దేవుడు ఎంత పట్టువట్టే..'' ఏడుత్తుంది ఎల్లవ్వ.

ఇంట్లకు అడుగు పెట్టినప్పుడున్న ధీమా లేదు. మనిషి జడుపుల వడ్డది.

"ఏం జెత్తవే ఎల్లా! నీ చేతులేముందే.... దాని బాకి ఎట్లుంటె గట్లనే ఐతది. ఒగ్గోన్ని దుబ్బులోన్ని తోలుకచ్చి ఎవ్వలకు తెలునకుంట కట్లేపెయ్యి. ఏర్పడకుంట లగ్గం జెయ్యి-శివ సత్తిని జేసి దానికో పెంట పెట్టకు'' ఓదార్చింది సావిత్రి

బలవంతాన మానెడు పెసార్లు ఒల్లోపోసి అమాసనాడు రావడం మరచి పోవద్దని మరోసారి యాదిజేసింది.

నిద్రలో నడుత్తున్నట్లు అడుగులో అడుగేసుకుంటూ ఇల్లు చేరుకుంది ఎల్లవ్వ. కూతురు బతుకు మీద బెంగ పట్టుకుంది. ఒకటి ఊహించితే ఒకటయింది. ఎట్ల... ఏం జెయ్యాలెనన్న తండ్లాట మొదలయింది. భర్త చనిపోయినప్పుడు... వేట కుక్కల్లా పోటీ పడి పటేండ్లు వెంబడిచ్చినప్పుడు... చివరికి ఊరు ఊరంతా చెవులు కొరుక్కుంటు న్నప్పుడు కూడా ఇంత బాధ కలుగలేదు.

ఇంటికి వచ్చి చెరో మంచంలో వాలిపోయారు. ఎవరో రైతు. ఎల్లమ్మ గద్దెను రేపు కడుతానని కచీరు తొక్కాలని బతిమాలి చెప్పి పోవడానికచ్చాడు. ఇంటి ముందు నిలబడ్డాడు.

దేవుని పట్నాలేత్తె గద్దెకెక్కిచ్చుడు, నాగెల్లి పట్నం, పెండ్లి పట్నం తొక్కుడు, శివసత్తుల బేటీ, వాళ్లను మెప్పిచ్చుడు, ఇంటింటి రాజులకు బొట్టుపెట్టుడు... అన్నీ ఎల్లవ్వ వంతే! తెనుగోల్ల పెద్దమ్మకు చేసినా గౌండ్లు ఎల్లమ్మ శిద్దోగం చేసినా ఎల్లవ్వకు వారం రోజులపని.

"చాత గాదయ్యా! పాణం బాగలేదు. మునుపటి లెక్క దమ్ముంట లేదు." మంచంలోంచి

లెవ్వకుంటానే చెప్పింది ఎల్లవ్వ. రైతు వెళ్ళిపోయాడు. ఏమనుకున్నాడో! మారుపలుకలేదు. 'నువ్వు ఎట్ల రావో చూస్త' అని మాత్రం అన్నాడు కోపంగా.

'అవును. ఈ ముచ్చట ఎవ్వలకు చెప్పొద్దు. దేవున్ని కట్టెయ్యాలె. శిగం రాకుంట జెయ్యాలె. ఒగ్గోల్లను పట్టుక రావాలె. తైబందు కడెం ఏపియ్యాలె. కట్లేసినట్టు గూడా ఎవలకు తెల్వొద్దు' నిర్ణయించుకుంది ఎల్లవ్వ. తాగిన జాగల ఎక్కడనో నోరు జారుతడని తండ్రికి కూడా చెప్పలేదు.

ఆ రోజంతా తల్లికూతుళ్ళిద్దరూ నోట్లె మంచి నీళ్లు పోయలేదు. ఒకరి నొకరు మాట్లాడించుకోలేదు.

ఎంత దాయాలనుకున్నదో అంత కంటే వేగంగా విషయం ఊరిలో గుప్పుమని లేచింది. కనవడ్డోల్లందరికీ చెప్పాడు సాయిరెడ్డి. బీడీల మాపును ఇచ్చేందుకు వెళ్ళేటప్పుడు వచ్చేటప్పుడు మూతులతో, చేతులతో సైగలు చేసేటోల్ల చేతలు ఆగిపోయాయి. ఆమె బతుకు అంగడంగడి కానిదే వాళ్లకు మనుసున పట్టడం లేదు. ఎవలకు ఎగేయ్యాలెనో వాళ్లకు ఎగేసారు. చేతికి అందకుండా పారిపోతున్న పిట్టకు దెబ్బతగిలి గిలగిల కొట్టుకుంటుంటే చూసి ఎగిరిగంతేయాలన్న వేటగానికోరిక వాళ్లకు.

మరునాడు ఎక్కడేం జెప్పింండ్రో గని అక్కడ మాత్రం దప్పులు అగినయి. అసలు పుట్టబంగారానికి వెళ్ళే తొవ్వ అది కూడా కాదు. ఎవరో ఎగేస్తే రైతు ఆ తోవ తొక్కి ఎల్లవ్వ ఇంటి ముంగట ఆపాడు. 'అవ్వ బిడ్డలు ఉరికత్తరు... తలుగనీ....'ఎవరిదో అరుపు.

రాత్రి వీధిలైట్ల వెలుతురులో దడుకూ దడుకూ దప్పు చప్పుడు. దుబ్బులోని బరాత్. రైతు నవ్వుతున్నాడు. 'నువ్వు ఎట్లరావో చూస్త' అని మరో సారి అనుకున్నాడు.

"ఇలాయి లెల్లమ్మిలాయిలే. రాములు పర్వా ఇలాయిలే. ఇలాయి లెల్లమ్మిలాయిలే. రాములు పర్వా ఇలాయిలే..." ఊలచ్చేటట్టు పంతపాట. కనుక దప్పు చప్పుడు... గజ్జెల గలగల ముగ్గురు శివసత్తుల ఆలువాట.

తలుపు లేసుకుంది ఎల్లవ్వ. కావాలనే ఇంటి ముందు దప్పులను కొడుతున్నారని తెలుసు.

"ఎట్ల... ఇప్పుడు ఎట్లజెయ్యాలె. దప్పుల చప్పుడుకు బిడ్డకు శిగమత్తదో ఏమో! ఎవలకు తెలువద్దనుకుంటే అందరికి ఎరుకైతదా ఏంది? నవ్వేటోల్ల ముందు జారిపడ్డట్టు. పీల్లకండ్లు మండ. కావాలనే చేత్తుండ్రు..." మంచంమీద కూర్చున్న బిడ్డ దగ్గరనే కూర్చుంది ఎల్లవ్వ. మనసంతా తల్లడ మల్లడమైతంది. కూతురు వైపే చూస్తుంది భయం భయంగా. కొత్తలో అయితే తనకూ ఇంతే! ఎక్కడైనా దప్పుల చప్పుడు వినిపిస్తే చాలు సిగమచ్చేది. చేతులో ఏముంది, ఏం చేస్తున్నా, పొయ్యి మీదేముంది... ఇవేవీ గుర్తుండవు. కాలులో కాలు గలిపి ఎగురుకుంటూ పోవుడే.... ఇప్పుడు కూతురుకు అట్లాగే శిగమత్తదేమోనని భయం!

బయట దప్పు ఆగుతలేదు. బరాత్ ఎక్కువయింది. కేకలు బొబ్బలు.

లలితలో వణుకు. మేడికాయలోలె గుడ్లు తీసింది. నెత్తిని విదిలించింది. పటపట పండ్లు కొరికి పెయ్యి విరిసి కేక వేసింది.

'ఓయవ్వో... నా నోట్లె మన్నువడ్డదే....' ఏడ్చుకుంట కూతురును దొరుకవట్టింది ఎల్లవ్వ.

అదిలిచ్చికొట్టి తలుపు తీసుకుని ఎగురుకుంట మందిల గలిసింది లలిత.

'మాయదారి మైసమ్మో... మైసమ్మ... మనం ఐతారం బోదమే మైసమ్మ' పోరగాల్లు సీటి గొడుతూ పాటను అందుకున్నారు. పెద్దోల్లు బెదిరిచ్చి తప్పయిందని చెంపలేసుకున్నారు.

లలితకు నోరు రాలేదు. ఎగతడుతూ ఏడుత్తుంది. భయపడ్డంతా జరిగినందుకు ఎల్లవ్వ బీరిపోయింది.

'నువ్వు దయ్యానివా...? భూతానివా...? ఏ దేశం...? ఎవలు నువ్వు..? దాగుడుమూతలాడక సక్కగ జెప్పు' పసుపును యాపాకులను నలిచి మొఖం మీద గొట్టి అన్నాడు ఒగ్గు దేవయ్య. అప్పటికే దప్పులతో వచ్చిన ముగ్గురు శివసత్తులు లలితను చుట్టుముట్టారు.

"దొంగ తనానికి రాలే. లంగతనానికి రాలే. నేటుగనే వచ్చినవు. శెల్లే... చెప్పు... ఎవలు నువ్వు. బాల మీద ఎందుకు కన్నేసినవు. చెప్పుతవా? బూరెంటికలు పట్టుమంటవా...?" ఎంటికలను అందుకుంది శివసత్తి.

లలిత మాట్లాడలేదు. ఏడుత్తనే ఉంది. శివసత్తులు చుట్టుముట్టి ఈరగొలతో యాప కొమ్మలతో పేరు చెప్పమని కొడుతున్నారు. చేతుల మీద, వీపు మీద వాతలు తేలుతున్నాయి. ఇది చూత్తున్న ఎల్లవ్వకు పాణము తల్లడమల్లడమైతంది. ఇంకోసారైతే ఆ దప్పుల చప్పుడుకు శిగమచ్చేదే! ఇప్పుడు ఏడుపత్తుంది.

పటపట పండ్లు కొరుకుతూ నోరు విప్పింది లలిత.

తను మాంకాలమ్మ దేవతనని, తనను అందరు మర్చిపోయారని, బోనాల పండుగను చెయ్యకపోతే ఊర్లె పశువులన్నింటిని మింగుతానని, మనుషులకు గత్తర లేపుతానని ఎగతడుతూ చెప్పి వెనక్కు విరుచుక పడి పోయింది లలిత.

ఇద్దరు ముగ్గురు ఆసరాపట్టి ఇంట్లోకి తెచ్చారు లలితను. ఇంకా క్యాల్లికి రాలేదు. దప్పులు దాటి పోయాయి. ఎల్లవ్వ గుండె అవిసిపోయింది. ఆశయ్య కూడా ఇంట్లో లేడు. పెండ్లి పనుల మీద ఊరెల్లాడు. లైటార్పేసి నూనె దీపం వెలిగించి గూట్లో పెట్టింది ఎల్లవ్వ. కూతురు నుదుటి మీద రూపాయి బిల్లంత బొట్టును అద్ది కట్టుకొంగును ముడేసింది. మొదట తాను శివసత్తి అయిన రోజులు గుర్తుకత్తున్నాయి. రూపాయి బిల్లను లలిత చుట్టూ తింపి నీళ్లకుండ కింద మిత్తిగట్టింది. నెత్తి ఈరబోసింది.

మరునాడు ఒగ్గు దేవయ్యను ఇంటికి రప్పించుకుంది ఎల్లవ్వ. కూతురుకు శిగం రాకుండా ఎట్లయినా కట్లెయ్యమని బతిలాడింది. తులం బంగారం పెడతానని ఒప్పుకుంది. దేవయ్య గుగ్గిలం పొగవేసి కనుకదప్పు మోగించినా మంత్రాలు చదివినా పూనకం రాలేదు. దేవతకు కట్లవడుడు ఇష్టం లేదని, అందుకే శిగం రావడం లేదని నాలుగైదు రోజుల తర్వాత వచ్చి కట్లేత్తానని చెప్పి వెళ్లిపోయాడు.

ఎల్లవ్వ చేసే ప్రయత్నం రైతులకు తెలిసిపోయింది. లలితపై కన్నేసిన వాళ్లు, ఎల్లవ్వ అంటే గిట్టని వాళ్ళు దేవతను కట్లేత్తే ఊరిలో పశువే కాదు, మనుషులకు గత్తరత్తదని రైతులను ఉసిగొల్పారు. ఆ రెండు రోజుల్లోనే సంఘానికొక పెద్దమనిషి చొప్పున కమిటీని వేసుకున్నారు.

అప్పుడే ఒకరిద్దరి పశువుల కాళ్లకు గాలికుంటు తగిలింది. దేవత ఊరి మీద పడిందన్న ప్రచారం మొదలయింది. ఒగ్గు దేవయ్యను ఊరిలోకి రావద్దని హెచ్చరించారు. ఎల్లవ్వనుకూడా ఊరు దాటవద్దని హెచ్చరించారు. ఏం చెయ్యాలో తోచడం లేదు ఎల్లవ్వకు. పిచ్చిపట్టినట్లుగా వుంది.

మేనరికం వాళ్లకు విషయం తెలిసింది.

'మంచే జరిగే... చెడ్డనే జరిగే... శిగమచ్చే పొల్ల మాకెందుకు. బజార్ల చప్పుడైతే పొయ్యి మీది కుండను ఇడిసిపెట్టి ఎగురుకుంట పోతది. శివసత్తి అంటే పట్టిగనే ఐతదా? కొను తలుగద్దాయె. నీసు తలుగద్దాయె. అంటు ముట్టు ఏది తలుగద్దాయె... సంసారమెట్ల జేత్తది. ఆ పిల్లను మేము చేసుకోము' అంటూ చెప్పి పంపారు.

ఎల్లవ్వ కాళ్లు మొక్కి బతిలాడింది. నన్నూ నా బిడ్డను మీరే కాపాడాలెనని కడుపుల తలపెట్టింది. పెండ్లి చేసినంక కట్లేద్దామని చెప్పింది. వారు వినలేదు. మా అన్న సచ్చిన్నాడే దూరమైనము. తలకు బాసిన ఎంటిక. ఏ రేవున పోతే మాకేందన్నరు. ఎల్లవ్వకు మనాది మొదలయింది. చివరికి మల్లయ్యను అడిగి చూసింది. పెళ్ళి చేసుకుంటానన్నాడు. ఎవరేమని చెప్పారో వారం తర్వాత నాకు వద్దన్నాడు. లలిత మరింత కుంగిపోయింది. ఏదో ఆధారం దొరికినట్టు కొద్దికొద్దిగా కోలుకుంటున్న ఎల్లవ్వకు గుండెలో రాయి పడ్డట్టయింది. కూతురు జీవితం ఇట్లమలుపు తిరుగుతుందని ఊహించలేదు.

"దేవుని గుల్లె రాళ్లవడ. మేమే దొరికినామా" అని ఏడ్వడం మొదలెట్టింది.

❄ ❄ ❄ ❄

నిండు అమాస, ఆదివారం కలిసచ్చింది. సావిత్రి రెండు రోజుల నుంచి ఎల్లవ్వ ఇంటి చుట్టే తిరిగింది. అవసరం తనది కాబట్టి, అడక్కుండానే వరాలు ఇచ్చింది. పటేలుతో చెప్పి పండుగు బంద్ చేస్తానని చెప్పింది. మాట బలం దొరికిందని ఒప్పుకుంది ఎల్లవ్వ. సావిత్రి చిన్న కొడుకు నవీన్‌ను కూడా రప్పించుకుంది.

అదేం గాశారమోగనీ... ఎల్లవ్వ బొట్టు పెట్టిన్నుండే సునంద కోలుకుంటోంది. చివరి పొత్తి ముగించి బందానం చేసే వరకు కూరుకురాత్రి దాటింది.

పటేలు ఆదుకుంటాడని చేసే పనులు ఒకటికి రెండుసార్లు చేసింది. అడక్కుండనే తాయితులు కట్టింది. ఇంటికి వచ్చే ముందు మరోసారి గుర్తు చేసినట్టుగా అన్నది సావిత్రితో.

"దొర్సానీ! ఊరంత పట్టువట్టింండ్రు, చెడిపోతె చెంగలిత్తమంటుండ్రు. పటేలుతోని చెప్పి దుబ్బులోడు, ఒగ్గోడు ఊర్లెకచ్చెటట్టు చెయ్యిండ్రి బాంచెను. దేవున్ని కట్లేసి యాడనన్న నాలుగు చెట్ల సాటుకు పొల్లనిచ్చిలగ్గం జేత్త..." ఎల్లవ్వ మాటలు పూర్తికానేలేదు. ఎక్కడ మొండిగ కూసుంటదోనని కచ్చితంగా చెప్పింది సావిత్రి.

"ఇగో ఎల్లా!... పదిమందిల పని. మన ఒక్కలది గాదు. చెప్పే తరీక చెప్తుతడు. ఇనకపోతే ఏం జేత్తడు. ఊరంతా ఒక్కటయింండ్రు" దొడ్లె పశువులు గుర్తుకు వచ్చి మరింత వివరంగా చెప్పింది సావిత్రి. ఇంకోసారి అడగకుండా.

ఎల్లవ్వ నీళ్ళు నమిలింది. సావిత్రి గుణం కొత్త కాకపోయినా ఇంత తొందరగా మారుతుందని ఊహించలేదు. మారుపలుకకుండా బయటకు నడిచింది. కళ్లల్లో నీళ్లు తిరిగినయి. నవీన్ తల్లికి ఏదో సర్దిచెప్పి చూసాడు. కాని సావిత్రి వినలేదు. ఎల్లవ్వ కొద్ది దూరం వచ్చి వెనక్కి తిరిగి చూసింది. నవీన్ తోడుగా వస్తున్నాడు.

"ఎందుకు పటేలా! మీరు పోండ్రి! నా దగ్గరేముంది పాణం దప్ప. అది ఎవలకు అక్కరకు రాదు. అక్కరకచ్చేటియి అన్ని పోయినయి. నాకేం భయంలేదు" అన్నది నడుస్తూనే!

నవీన్ వెనక్కి తగ్గలేదు. మారు చెప్పకుండా గబాగబా ఎల్లవ్వను చేరుకుని పక్కపక్కగా నడుస్తూ అడిగాడు.

"ఎల్లవ్వా.... మన ఊర్లె ఎందరికి శిగాలత్తయి...?"

విచిత్రంగా తలెత్తి చూసింది ఎల్లవ్వ. అతడినుండి ఆ ప్రశ్న ఊహించలేదు. అతడితో చనువు కూడా లేదు. ఒకటి రెండు సార్లు చూసి పోల్చుకోవడమే. పట్నంలో చదువుకుంటాడు. అందరూ ఉండాలని షరతు పెడితే సావిత్రి తెప్పించింది. ఇట్ల అడుగుతడేంది? అనుకుంది. సమాధానం చెప్పేలోపే మళ్లీ అడిగాడు నవీన్.

"పోనీ.... మా కులంలో గానీ... రావుల కులంలో గానీ కోమట్లకు గానీ బామన్లకుగానీ ఎవలకన్నా శిగమత్తదా చెప్పు! అదీ ఆడోల్లకు!" మాటలు ఏవో తర్కాన్ని మొదలు పెడుతున్నట్టుగా వున్నాయి.

లేదన్నట్టు తలూపింది ఎల్లవ్వ. అతడు ఏం చెప్పబోతున్నాడో కొద్దిగా అర్థమయింది.

"చూడు.... పెద్ద కులపోల్లకు రాని దేవుడు చిన్న కులపోల్లకే ఎందుకత్తది. ఇది దేవుడు కాదు దయ్యం కాదు. మానసికంగా బాధపడితే ఈ రోగమస్తది. సమాజంలో గుర్తింపు కోసం భద్రత కోసం లేని దేవున్ని ఆపాదించుకుని శివసత్తులవుతారు. నువ్వు కూడా అంతే! నీకు తెలియకుంటనే ఇలా మారావు...."

ఇద్దరూ నడుస్తున్నారు. కొత్తగా వింటుంది ఎల్లవ్వ. చుట్టూ చీకటి. వీధిలైట్ల వెలుతురు. జనం ఎవరూ లేరు. అక్కడక్కడా కుక్కలు ఎదిరిచ్చి మొరుగుతున్నాయి.

"లలితను డాక్టర్‌కు చూపిస్తే రోగం తగ్గిపోతది. ఆమెకు ఇష్టం లేని పెళ్ళి ఖాయంచేయటం వల్లే ఇలా జరిగింది."

ఉల్కిపడి... భయపడింది ఎల్లవ్వ. అడుగులు తడబడ్డాయి. నవీన్ మాట్లాడుతూనే ఉన్నాడు. ఇల్లు చేరుకున్నారు. ఎల్లవ్వలో ఏదో ఆవేశం. అతడి మాటల వల్ల కలిగిన ఏదో ఆరాటం! గంభీరంగా మారిపోయింది.

లలిత మెలకువతోనే ఉంది. ఆశయ్య వాకిట్లో మంచం మీద గుర్రుకొడుతున్నాడు. మంచం కోడు మీద కూర్చున్నాడు నవీన్. ఎల్లవ్వ గోడకు ఆనుకుని మంత్రించిన ముద్దలా నిలబడింది.

"ఊరికి మాత్రమే కాదు. అభివృద్ధికీ దురంగానే ఉంచబడుతున్నారు మీరు. మీలోని ఏ మాత్రం ఎదుగుదలను చూసినా ఓర్వరు. లలిత ఆరవ తరగతిలో ఉన్నప్పుడు నేను పదవ తరగతిలో

ఉన్నాను. పాటల పోటీలో లలితకు ఫస్ట్ ప్రైజ్ వచ్చి నాకు సెకండ్ ప్రైజ్ రావడమన్న ఒక చిన్న విషయం కూడా మా కులంలో చర్చకు దారి తీసింది. 'ఆశాలూ.... ఆడిపిల్లకు చదువెందుకురా' అని బెదిరించక పోయినా నచ్చజెప్పి బడి మాన్పించే వరకూ ప్రయత్నాలు ఆపలేదు. ఆదే క్లాసులో ఉన్న మా కులం పిల్లలకంటే లలిత చురుగ్గా ఉండడమే అందుకు కారణం. ఇప్పుడూ అంతే! మోడు వారిన మొక్క చిగురించకూడదు. లలిత ఎవరికీ అందకుండా దూరంగా పోకూడదు" ఆవేశంగానే అయినా అర్థమయ్యేంత నిదానంగానే చెబుతున్నాడు. స్వరం మాత్రం తీవ్రంగా ఉంది.

ఎల్లవ్వకు అర్థమై అర్థం కానట్టు.... ఆవేదనగా... ఆందోళనగా ఉంది. 'ముందు ఇలానే అంటాడులే' అని కొట్టి పారేసినా అతడు పట్టుదలగా చెబుతుండే ఏదో చెయ్యాలనే ఆరాటం మొదలవుతోంది. దానితోనే భయం కూడా!

అవ్వ బిడ్డలిద్దరూ మూలకు ఒదిగి కూర్చున్నారు. లలిత కూడా అతడి మాటల్ని వింతగా వింటుంది. చెప్పాల్సిన వివరాలు చెప్పాక లలితను డాక్టర్‌కు చూపిస్తానని, నెల రెండు నెలల్లో ఆమె బాగవుతుందని, మల్లయ్యను కూడా ఒప్పిస్తానని, పెళ్లిచేస్తే ఏ శిగముండదని నచ్చచెప్పాడు. ఏ విధంగా నైనాసరే! కూతురు జీవితం బాగయితే చాలన్నట్టున్న ఎల్లవ్వ ఎనకా ముందు ఆలోచించ కుండా, ఎవరికంట పడకుండా లలితను వెంటబెట్టుకొని పట్నం పోయింది మరునాడే!

తల్లీ కూతుళ్లిద్దరూ కనబడకపోతే అనుమాన పోతరని కూతురును అక్కడే ఉంచి మరునాడే తిరిగివచ్చింది. అప్పటికే పుకారు పుట్టింది. ఎల్లవ్వను చూసాక సద్దు మనిగినా నవీన్‌తో లలితను పట్నంలో చూసిన ఒకరిద్దరు పల్లెకు రావడంతో 'లలిత లేచి పోయిందని' ఊరు కోడై కూసింది.

సాయిరెడ్డి పట్నం పోవడం, తన కోరికనంతా కోపంగా మార్చుకుని కసిదీరా లలితను కొట్టడం, ఊళ్ళోకి గుంజుకు రావడం, పంచాదులు, సాపెనలు...'ఎందునెరుగని నా పోరడే దొరికినాడే మీకు. అప్పుడు అవ్వ ఎగిసి తిరిగింది. ఇప్పుడు బిడ్డ తిరుగుతోంది' అని సావిత్రి తిట్లు... రెండు రోజుల్లోనే పూర్తయిపోయాయి.

ఎల్లవ్వకు ఆశయ్యకు దెబ్బలు తప్పలేదు. లలితనైతే భూమ్మీద నుంచి లేవడం లేదు. ఒళ్లు వాచి పోయింది. ఏ ఒక్కరూ పాపమనలేదు. అడ్డం వచ్చిన నవీన్‌ను ఇంట్లోంచి కదలనీయలేదు సావిత్రి.

"పోరికి దేవుడత్తది. దేవుడచ్చిన పోరి గుడిల దేవత లెక్క ఉండాలె. ఇట్ల చెడ్డపని చేత్తే దానికి కాదు, ఊరికే అనిష్ట" అన్నారు. తొందరగా పండుగు చేసి, శివసత్తిని చెయ్యాలని ప్రయత్నాలు మొదలెట్టిండ్రు.

ఇదంతా తన మూలంగానే జరిగిందని, కనీసం పండుగు జరగకుండానైనా ఆపాలని వచ్చి ఇక ముందు లలిత విషయంలో ఎవరు ఏ మాత్రం జోక్యం చేసుకున్నా కేసు పెడతానని బెదిరించాడు నవీన్.

అంతా సద్దుమనిగారు. లలిత మాత్రం తేరుకోలేదు. మరింతగా కుంగిపోయింది. రోజుకు నాలుగు సార్లయినా శిగమత్తుంది. కట్టెపుల్లలా తయారయింది. కూతురును చూసి ఎల్లవ్వ కూడా రోగిలా తయారయింది. తనకు తెలిసిన పద్ధతులన్నీ ఉపయోగిస్తోంది. ఇంతకు ముందయితే కూతురుపై ఎన్నో ఆశలుండె. ఇప్పుడు కనీసం ప్రాణంతో కళ్లముందుంటే చాలన్న ఆలోచన

మొదలయింది.

కనీసం పండుగు చేసి శివసత్తిగా నిలిపితేనైనా కూతురు కళ్ళముందుంటుందనుకుంది. పండుగు చేయడానికి రైతులు రెడీగాలేరు. కాళ్ల బేరానికి వెళ్లింది ఎల్లవ్వ. కాదన్నారు రైతులు.

నలుగురు శివసత్తులు, ఇద్దరు బైండ్లోళ్లు, ఇద్దరు దుబ్బులోళ్ళు, నాలుగు బోనాలతో తానే గద్దె పట్నమేసి దేవున్ని మెప్పియ్యడానికి సిద్ధపడింది ఎల్లవ్వ. ఆశయ్య కూతురు చెప్పినట్టే చేస్తున్నాడు.

ఈ విషయం నవీన్‌కు తెలిసి ఊర్లోకి వచ్చాడు. పండుగను ఆపాలని చూసాడు.

" నువ్వు చేసిన నిర్వాకం సాలు పటేలా! నా బిడ్డను ఇంకింత ఆగంజేసిందే నువ్వు! మా బతుకేదో మేం బతుకుతం. కిస్మత్‌ల ఎట్ల జరిగేడిదుంటే అట్లె జరుగుతది. పండుగు జేసి గద్దెకెక్కిస్తే కనీసం నా బిడ్డనైనా దక్కుతది" ఏడుస్తూ చేతులెత్తింది ఎల్లవ్వ.

ఆశయ్య తిట్లు అందుకున్నడు. నవీన్ సర్ది చెప్పాలని చూసాడు. ఎవరూ వినలేదు. మనసు చిన్న బుచ్చుకుని వెళ్లిపోయాడు.

పండుగు జరిగింది. లలిత శివసత్తిగా గద్దెకెక్కింది. ఆదివారం బేస్తవారం శిగమూగి బొట్టుపెట్టి కచీరు కడుతుంది. కొత్త దేవత వున్నదని ప్రచారం మొదలయింది. ఊళ్లో వారు, పక్క ఊళ్లవారు దారలు వడ్డరు. పాణం బాగాలేకున్నా, బోరు బాయిల్లో నీళ్లు పడకున్నా, ఎడ్లు, మనుషులు దెంకపోయినా ప్రశ్నలు అడగడానికి వస్తున్నారు. తల్లికంటే బిడ్డ చేతి గుణం మంచిదని అందరూ చెప్పుకుంటున్నారు. ఎల్లవ్వ శిగం శాంతించింది. లలిత శిగం మొదలయింది.

ఎట్లయితేంది...? కూతురు పాణం బాగుంటే చాలనుకున్న ఎల్లవ్వకు నిరాశనే ఎదురయింది. రోజురోజుకు లలిత కట్టెపుల్లయింది. ఆమె రూపమే మారిపోయింది. వెర్రిచూపులు చూస్తుంది. అన్నం తినడం, మాట్లాడ్డం మానేసింది. తనలో తానే ఏదో వదురుతుంది.

ఎల్లవ్వకు ఇంతకు ముందటి వేదింపులు లేవు. ఇంటి చుట్టూ చుట్టుకునే కామాంధుల చూపుల్లేవు. కూతురు ఎక్కడికి పోయిందోనన్న భయంలేదు. ఎవరస్తారోనన్న బుగులు లేదు. గుడిసె మీద పడే రాళ్లు... సూటిపోటి మాటలు... ఎవ్వీలెవ్వు. బతుకు మీద భయం మాత్రం ఉంది.

"బిడ్డా.... పండుగజేత్తే మంచిగైతదనుకుంటమి. రోజురోజుకు అద్వాన్నంగావట్టె! ఊర్లె మన్నువడ పట్టువట్టిరి....." ఎన్నడు ఏడ్వని ఆశయ్య కూడా ఏడ్వడం మొదలెట్టాడు.

"నాయినా... నేనేం జేత్తునే... నా బతుకే ఇట్లయింది... అదన్న మంచిగ బతుకుతదనుకున్న. ఒక్క బిడ్డని ఒడిగట్టి సాదుకున్న. ఒగ అయ్యి చేతులవెట్టి దాని పంచన బతుకుదామనుకున్న. ఎటూ గాని బతుకాయె. ఎక్కడెవలు ఆధారం లేకుంటాయె' ఏడుపందుకుంది ఎల్లవ్వ.

ఇంట్లోంచి వాయిక్కు వాయిక్కు మని కక్కుకున్న చప్పుడు.

ఇద్దరూ ఇంట్లోకి పరుగుతీసారు. లలిత కక్కుకుంటుంది. రక్తం ముద్దలు ముద్దలుగా. ఎల్లవ్వ ఏడుస్తోంది. ఆశయ్య మాత్రం ఆలోచిస్తున్నాడు. అతనిలో ఏదో తెగాయింపు. భార్య పోయినప్పుడు, కూతురు ఆగమైనప్పుడు లేని ధైర్యం... తెగాయింపు!

ఉన్నట్టుండి లలిత మాయమయింది. అప్పుడే అతిసార మొదలయింది. కక్కుడు బైలు.

జనంకు భయం పట్టుకుంది. అంతకంటే ముందుగానే ఎల్లవ్వకు భయం పట్టుకుంది. లలిత నితం కాపాడకుండా చెడగొట్టిందని అందుకే గత్తర మొదలయిందని జనం ఎక్కడ దాడి చేస్తారో అన్న భయం మొదలయింది. అంతకంటే ఎక్కువ భయం కూతురుపైనే!

ఎక్కడికెళ్ళింది....? ఏమైందనే ఆందోళన!

ఆపదలో ఉన్న జనం ఇంటిమూడు చుట్లు తిరుగుతున్నారు. ఎవరూ నోరు తెరువకముందే.... ఎక్కడికెళ్లిందని అడగక ముందే గాయికెత్తుకున్నాడు ఆశయ్య. ఊరు తన మనుమరాలును ఆగం జేసిందని పిచ్చిలేపి దేశాలు పట్టించిందని శిగం శిగమని దాని గోసపుచ్చుకున్నరని పేరు పేరున, రేవు రేవున తిట్టుడు మొదలుపెట్టిండు.

ఎన్నడూ నోరు విప్పని తండ్రి తిరగబడి ఇరుగ తిడుతుంటే నోరు తెరిచింది ఎల్లవ్వ. 'నాయినా ఇట్లెందుకే! మనను ఉంచుతరా?' అని అడక్కముందే...

"నీకు తెల్వది బిడ్డా.... ఈ తెగారం ఇరువై ఏండ్ల కిందుంటే నీకు ఇంకోలగ్గం జేత్తుంటిని. ఇరువైరోజుల కిందున్నా దానికి లగ్గం జేత్తుంటిని. ఇప్పుడు గనుక నోరు ఇప్పకపోతే... దవాఖాన్లకు బోయి దాన్ని గుంజుకత్తరు. దాని బతుకే ఆగమైపోంగా దేవుడేందీ దయ్యమేందీ. మనం తెగారం జెయ్యాలెగనీ నాలుగు రోజులల్ల మంచిగైతది అది "నచ్చ జెప్పుతూ తిట్లను అందుకున్నాడు ఆశయ్య.

ఎల్లవ్వకు పరిస్థితి అర్థమైంది. తండ్రికచ్చిన తెగారమచ్చింది.

"వాని కంటికిన కండ. వాని తలపండు వలుగ. దాని దినాలుగాను... వీని బొందవెట్టి బోకెతియ్య.... నాబిడ్డను ఆగం జేసే... కలకల తలిగిపోతరు. బాగైతారు!..." తండ్రి కంటే గొంతును పెంచింది ఎల్లవ్వ.

ఇంటి ముందుకు మనిషి గాదు కదా పురుగు రావడం లేదు ●

